అతివేగంతో పెరుగుతున్న ప్రమాదాలు



పెనుగొండ శివారు గ్యాస్ కంపెనీ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన యువకుడు (ఫైల్)



భట్లమగుటూరు వద్ద రోడ్డు ప్రమాదంలో యువకుడు (ఫైల్)



పెనుగొండలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గుట్టలుగా పడ్డ మోటారు సైకిళ్లు

పెనుగొండ: మితిమీరిన వేగం ప్రాణాలను హరించివేస్తుంది. లేదంటే క్షతగాత్రులను చేసి మంచం పాల్జేసి కుటుంబాన్ని ఆర్థిక భారంలో ముంచేస్తున్నారు. నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ప్రమాదాలతో రోడ్డు ఎక్కాలంటే చాలు ప్రజలు హడలిపోతున్నారు. కొద్దికాలంలోనే నలుగురైదుగురు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పదుల సంఖ్యలో ప్రజలు ప్రమాదాల వల్ల ఆసుపత్రుల పాలయ్యారు. కేవలం వారం రోజుల్లోనే పెనుగొండలో ఆసుపత్రుల పాలై లక్షల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడడంతో ఆయా కుటుంబాలు అప్పుల పాలవుతున్నారు. పెనుగొండ, వెంకట్రామపురం, నెగ్గిపూడి, మార్టేరు రహదారిలోనే నలుగురికిపైగా ప్రాణాలు విడిచారు. పెనుగొండ గ్యాస్ కంపెనీ వద్ద మునమర్రుకు చెందిన పేద కుటుంబంలోని ఓ యువకుడు, మార్టేరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ దంత వైద్యుడు, లాకుల సమీపంలో పెనుగొండ కళాశాల కు చెందిన ఓ విద్యార్థి, పంచాయతీ వద్ద ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు మృత్యువాత పడ్డారు. సిద్ధాంతం శ్రీజ్ఞాన సరస్వతీ సాయినాథుని ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధాంతానికి చెందిన ఓ యువకుడు ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. ఇదేవిధంగా భట్ల మగుటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు.

అతివేగమే ప్రధాన కారణం

ప్రమాదాలకు అతివేగమే ప్రధాన కారణంగా ఉంటుంది. మంగళవారం పెనుగొండ సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం వద్ద ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. అయితే ఈ ఘటనలో ప్రాణాపాయం జరగకపోయిన పదుల సంఖ్యలో మోటారుసైకిళ్లు గుట్టలుగుట్టలుగా పడి పాడైపోయాయి. యువత మోటారు సైకిళ్లపై చేస్తున్న ప్రమాదాలతో క్షతగాత్రులై చాలా మంది మంచాలపాలవుతునఆనరు. పెనుగొండ కళాశాల కూడలి వద్ద జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఓ ఏఎస్ఎం మంచం పాలైంది. నడవలేని స్థితికి చేరుకుంది. మరో వృద్ధుడికి తొడ ఎముక విరిగి పోవడంతో మంచం పాలయ్యాడు. పెనుగొండ మెయిన్ బజారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి ముఖం పూర్తిగా గాయపడడంతో నానావస్థలు పడుతున్నాడు. దాదాపుగా ఏడెనిమిది లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సి ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. పెనుగొండ ఏఎంసీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలోనూ మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. మార్టేరు పాలకొల్లు, మార్టేరు నత్తారామేశ్వరం, పెనుగొండ మార్టేరు రహదారులు విస్తరణ చేయడంతో పాటు, ఆచంట రహదారిలోనూ మరమ్మతులు చేయడంతో మోటారు సైకిళ్లు, ఇసుక లారీలు ఇతర వాహనాల వేగానికి అంతే లేకుండా పోతుంది. ఇటీవల మార్టేరు ఇసుక లారీ ఏకంగా డివైడర్‌పై వెళ్లి మధ్య ఆగిపోవడం ఆయా ప్రాంతాల వాసులను బెంబేలెత్తించింది. ఇలాంటి సంఘటనే పెనుగొండ సిద్ధాంతం రహదారిలోనూ జరిగింది. ఇప్పటికైనా పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

చెత్త తొలగింపు



సందు శుభ్రం చేయించిన మునిసిపల్ అధికారులు

సాక్షి స్పందన

పాలకొల్లు సెంట్రల్: క్షీణించిన పారిశుద్ధ్యం పేరుతో సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. చినగోపురం వీధిలో ఆర్యవైశ్యకళ్యాణ మండపం ఎదురుగా ఉన్న చిన్న రహదారిలో చెత్త తొలగించి శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం: వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నరసాపురంశాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం సచివాలయ ఉద్యోగులు నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లతో గతంలో చేయించిన పనులు ఇప్పుడు తమతో చేయిస్తున్నారని వాపోయారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, అవమానాలు పడుతున్నామని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి చేసే పనులు అప్పగించడం మానాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్స్ వెంటనే ఇవ్వాలని, ఆరేళ్లు ఒకే కేడర్‌లో సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నరసాపురం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి

నరసాపురం: మానసిక వికలాంగుల హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగకూడదని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పీచుపాలెం కళ్యాణి మానసిక వికలాంగుల కేంద్రంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మానసిక వికలాంగుల చట్టం ఎన్నో హక్కులు కల్పించిందని చెప్పారు. వారికి గానీ, వారి తల్లితండ్రులు, సంరక్షుల ఆస్తి విషయాల్లో గానీ, ప్రభుత్వ ప్రయోజనాలు పొందే అంశంలోగానీ ఇబ్బందులు తలెత్తితే న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని చెప్పారు. నరసాపురం సీనియర్ సివిల్‌జడ్జి ఎ.గంగరాజు, కళ్యాణి మానసిక వికలాంగుల కేంద్రం కరస్పాండెంట్ ఎ.నళినీదేవి, నరసాపురం బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సూర్యప్రకాశరావు, టౌన్ సీఐ బి.యాదగిరి, విన్నా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానం పేరుతో ప్రైవేటీకరణ

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో కూటమి పాలనలో పీపీపీ పేరుతో అన్నింటినీ ప్రైవేటికరిస్తున్నారని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.జయప్రభ అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా భవనం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయప్రభ మాట్లాడుతూ ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై మహిళ సంఘ సభ్యులు వేగంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా ఐద్వా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డి.రోజామణి, బి.శ్యామల, స్వరాజ్యలక్ష్మి, బి.సరోజినీ, యర్రా భాగ్యం పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో ఒరిగిందేమీ లేదు

పెనుగొండ: జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలకు ఒరిగిన లాభమేమీ లేదని, కేవలం ధనవంతులకు మాత్రమే ఉపయోగపడిందని రైతు సంఘం నాయకుడు నెక్కంటి కృష్ణమూర్తి ఆరోపించారు. శుక్రవారం ఆచంటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సామాన్యులకు పనికి వచ్చే నిత్యవసరాలు, మందులు, వస్త్ర దుకాణాల వద్ద ఎమ్మార్పీ రేటు మీద జీఎస్టీ తగ్గింపు కాకుండా, వారు కొనుగోలు చేసిన జీఎస్టీ ట్రాన్స్‌ఫర్‌లో కలిపి ఎంత వరకూ వస్తుందని ప్రశ్నించారు. ప్రస్తుతం జీఎస్టీ వల్ల వర్తకులకు మాత్రమే లాభం కలుగుతుందన్నారు. జనరిక్ మందులు తెచ్చి కొంత మంది వ్యాపారులు మందుల షాపులో విక్రయించి, రూ.50కి అమ్మాల్సిన మందులు రూ.150కి అమ్మకాలు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనరిక్ మందులపై ప్రభుత్వం జనరిక్ అని ముద్ర వేయడం వల్ల సామాన్యులకు అవగాహన కలుగుతుందన్నారు. చేనేత వస్త్రాలపై 40 శాతం రిబేట్ అని ప్రభుత్వం చెబుతుందని, జిల్లాలో చేనేత సొసైటీలు, ఆప్కో వస్త్ర దుకాణాలు ఆ రిబేట్ ఎక్కడ అమలవుతుందో? చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్టీఆర్ వైద్యసేవల నిలిపివేత

- ఆసుపత్రుల ముందు నోటీసు బోర్డులు

పాలకొల్లు సెంట్రల్: ఎన్టీఆర్ వైద్య సేవలందించే ఆసుపత్రులు శుక్రవారం తమ వైద్య సేవలను నిలుపుదల చేశారు. పట్టణంలో ఉన్న రెండు ఆసుపత్రుల్లో బయట 'ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బతుకు భారమైంది నడక కష్టమైంది' 10 నుంచి వైద్య సేవలు బంద్ అంటూ నోటీసు బోర్డులు అంటించడంతో రోగులు వెనుదిరిగి వెళ్లిపోయారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 10 నుంచి నెట్ వర్క్ వైద్య సేవలు నిలుపుదల చేస్తామని తాము ప్రభుత్వానికి ముందుగానే హెచ్చరించామనిని అయినా ప్రభుత్వం దిగి రాకపోవడంతో తప్పని పరిస్థితుల్లో తాము బంద్‌లో పాల్గొనాల్సి వచ్చిందని నెట్‌వర్క్ ఆసుపత్రుల వైద్యులు చెబుతున్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థి దశలోనే ఏ సమయంలో ఎలా మాట్లాడాలి? ఎలా స్పందించాలి? ఏమి చేయాలి? వంటి వాటిపై అవగాహన పెంచుకుంటే ఏ విషయంలోనైనా విజయం సాధించవచ్చని చార్టెడ్ అకౌంటెంట్ బంగారు మనోజ్ విష్ణు అన్నారు. శుక్రవారం స్థానిక దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ పాలకొల్లు రైజింగ్ సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

యలమంచిలి: టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ధాన్యం కొనుగోలు సమయంలో ఎటువంటి అవకతవకలు ఏర్పడకుండా రైతులు ఇబ్బంది పడకుండా ముందుగానే ధాన్యం కొనుగోలు పై జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి దుంగా బాలత్రిపుర సుందరి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ధాన్యం కొనుగోళ్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని తద్వారా మాత్రమే రైతులు ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు మద్దతు ధర రూ.2389, సాధారణ రకానికి రూ.2369 ప్రకటించిందన్నారు. ధాన్యంలో తేమ శాతం 17 శాతం ఉండేలా చూసుకోవాలని, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం 5 శాతం, పరిపక్వం కానీ ముడుచుకుపోయిన వంకర తిరిగిన ధాన్యం గింజలు 3 శాతం ఉండేలా చూసుకోవాలని ఆమె తెలిపారు. పాలకొల్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజ్మీర్ బడ్డు మాట్లాడుతూ ధాన్యం రవాణా చేసే అన్ని వాహనాలకు జీపీఎస్ పరికరాలు కచ్చితంగా ఉండాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, డీఏవోలు ఎప్పటికప్పుడు వెహికల్ కొరతను స్ప్రెడ్ షీట్ లో నమోదు చేసి రైతులు వాహనాల విషయంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా ముందుగానే తెలియజేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు పూడి డేవిడ్‌సన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే గోనె సంచుల కొరత లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పోడూరులో..

పాలకొల్లు సెంట్రల్: ధాన్యం అమ్మకాల్లో తేమ శాతం ముఖ్యమని 17 శాతం లోపు ఉన్న ధాన్యాన్ని విక్రయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు అన్నారు. శుక్రవారం పోడూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కాస్టోడియన్ అధికారులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి విశ్వాసరావు మాట్లాడుతూ ధాన్యం ప్రభుత్వం నిర్వహించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉంటే గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ అధికారి టి.సరిత సుధ, డీటీ కేవీవీ సత్యనారాయణ, ఎంఎల్ఓ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆచంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా పెచ్చెట్టి



ఆచంట పట్టణ వైఎస్సార్ సీపీ కమిటీని అభినందిస్తున్న నాయకులు

పెనుగొండ: ఆచంట పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పెచ్చెట్టి సత్యనారాయణను నియమిస్తున్నట్లు మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి తెలిపారు. శుక్రవారం ఆచంటలో నిర్వహించిన పార్టీ సమావేశంలోనూతన కమిటీనీ ఎన్నుకున్నారు, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు) మాట్లాడుతూ కూటమి అరాచక పాలనకు స్వస్తి పలికే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. 18 నెలల్లోనే కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటుందన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా కూటమి నాయకులు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా యువజనవిభాగం అధ్యక్షుడిగా పీతల అంబేడ్కర్‌ను, రైతు విభాగం అధ్యక్షుడిగా నెక్కంటి రామలింగేశ్వరరావును, బీసీ సెల్ అధ్యక్షుడిగా కోళ్ల రాజారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పీతల జ్ఞాన రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మన్నే సీతను ఎన్నుకున్నారు. అనంతం మెడికల్ కాలేజీల ప్రైయివేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆచంటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, ముప్పాళ వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, జక్కంశెట్టి శ్రీరాములు, నంబూరి రాజు, అడ్డాల పెద్దిరాజు, తప్పెట్ల వెంకట్రావు, నెక్కంటి రామలింగేశ్వరరావు, యాళ్ల బాలాజీ, చదలవాడ ఆనంద్, షేక్ ఖాసీం, కామన హరిబాబు, చదలవాడ ముత్యాలరావు, దొమ్మేటి రాంబాబు, మట్టా చంటి, కేతా తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఖర్చుపై కాకుండా ఆదాపై దృష్టి పెట్టాలి

నరసాపురం: యువత సంపాదించిన సొమ్మును ఖర్చు చేయడం కంటే ఆదా చేయడంతో దృష్టి పెట్టాలని విజయవాడ మూఫ్స్ కన్సల్టెన్సీ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చిలుకూరి విజయ కుమార్ అన్నారు. పట్టణంలోని వైఎస్ కళాశాలలో మెనేజ్మెంట్ స్టడీస్ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్ అనే అంశంపై కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ కుమార్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అందరూ సంపాదించిన సొమ్ము ఖర్చు విషయంలో ఉత్సాహం చూపిస్తారని విజయకుమార్ చెప్పారు. కానీ అవసరమైన ఖర్చులకు ప్రాధాన్యత ఇచ్చి సొమ్ము ఆదాపై దృష్టిపెట్టాలని సూచించారు. ముఖ్యంగా రూల్ నెంబర్ 72 ద్వారా సేవింగ్స్ ప్రాముఖ్యతను వివరిరచారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ రీసెర్చ్ అడ్వైజర్ ఆర్.సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, డైరెక్టర్ ఎస్.చింతారావు, మెనేజ్మెంట్ స్టడీస్ విభాగం అధిపతి ఆర్.పార్థసారధి ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్ఆర్డీ డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యావేత్త నారాయణకు ఘన నివాళి



నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

యలమంచిలి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ప్రముఖ విద్యావేత్త కామ్రేడ్ నాగటి నారాయణ మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద యూటీఎఫ్ యలమంచిలి మండల శాఖ శుక్రవారం ఘనంగా నివాళులర్పించింది. కామ్రేడ్ నారాయణ పోరాటపటిమతో యూటీఎఫ్ ఉద్యమాన్ని ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా దశదిశల వ్యాప్తి చేశారని ఆయన సేవలను వక్తలు కొనయాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్, మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తినాయుడు, కోశాధికారి వర్ధనపు సందీప్ కుమార్, కార్యదర్శులు పెచ్చెట్టి నాగ శ్రీనివాస్, మల్లుల శ్రీధర్, మండపాక రాంబాబు పాల్గొన్నారు.

పోడూరులో..

పాలకొల్లు సెంట్రల్: ఉపాధ్యాయులు అప్రెంటిస్‌ను రద్దు చేయడంలో, ఏఏఎస్ స్కేల్స్ సాధించడంలోనూ నాగటి నారాయణ ఎంతో కృషి చేశారని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం పోడూరు మండలం పోడూరు గ్రామంలో యూటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కామ్రేడ్ నాగటి నారాయణ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.నాగరాజు, కె.పెద్దిరాజు, డి.క్షేమమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



కోటి సంతకాల వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న పాలకొల్లు ఇన్‌చార్జ్ గుడాల గోపి, పరిశీలకుడు మురళీకృష్ణంరాజు



తూర్పుపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటుపరం చేయాలనే కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడను ఎండగట్టాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంతకాల సేకరణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం అయితే ఇప్పటికే పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు భారమైన వైద్యవిద్య మరింత ప్రియమయ్యే ప్రమాదం ఉంటుందని మండిపడ్డారు. ప్రజా శ్రేయస్సుకోరి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రజలందరూ భాగస్వాములయ్యి మన వైద్య విద్యా హక్కును కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి నిర్వహణ కొరకు గ్రామాల్లో, వార్డుల్లో అనుబంద కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. వారికి కోటి సంతకాల సేకరణకు సంబంధించిన రెండు పత్రాలను అందించి సంతకాలు చేయిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో అక్టోబర్ 10 నుంచి నవంబర్ 22 వరకూ గ్రామ, వార్డుల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. అక్టోబర్ 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీ, నవంబర్ 12 న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలు అనంతరం రాష్ట్ర గవర్నర్‌కు ప్రజా వ్యతిరేక సంతకాలను జగన్మోహన్ రెడ్డి అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, పార్టీ నాయకులు యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, యినకొండ రవి, ఉచ్చుల స్టాలిన్, కర్రా జయసరిత మద్దా చంద్రకళ, చెన్ను విజయ్, పాలపర్తి కృపానాథ్, జోగాడ ఉమామహేశ్వరరావు, పిల్లా శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, రవి, ఇస్మాయిల్, దాసరి సత్యనారాయణ, రాజేష్, రామాంజుల మధు, వీరా మల్లిఖార్జునుడు, కవురు రాంపండు, అన్నవరపు వెంకటరమణ, గేదెల శ్రీనివాస్, మామిడిశెట్టి చిట్టిబాబు, ఈరంకి కాశి, శంకరావు శ్రీనివాసు, సాలా నర్సయ్య, కొరగింజల హనుమంతు, పిట్టా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ పోస్టర్ల ఆవిష్కరణ

పెనుగొండ: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్లను శుక్రవారం తూర్పుపాలెంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అడ్వైజరీ కమిటీ సూచనల మేరకు పోస్టర్లను ఆవిష్కరించినట్లు నాయకులు తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరమవుతుందని నాయకులు వివరించారు. కార్యక్రమంలో పెనుమంట్ర మండల కన్వీనరు గూడూరి దేవేంద్రుడు, నాయకులు కర్రి వేణుబాబు, దాట్ల గోపాలకృష్ణంరాజు, చంటిరాజు, సత్తి విష్ణుకుమార్ రెడ్డి, పోతుముడి రామచంద్రరావు, సత్తి సుబ్బారెడ్డి, కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, కీర్తి తాతాజీ, చింతపల్లి గురుప్రసాద్, రావి రత్నకుమార్, గుడాల చంటి, గుబ్బల వీర బ్రహ్మం, గొట్టుముక్కల రమేష్, రామన వీర్రాజు, దంపనబోయి బాబూరావు, చిటికెన బాబీ, పులిదిండి వెంకటేశ్వరరావు, కుక్కల సూరిబాబు, పడాల అబ్బులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా తగ్గిన జీఎస్టీ ధరలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ సాంబశివరావు అన్నారు. శుక్రవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో వివిధ ఎలక్ట్రానిక్స్ వ్యాపార సంస్థల్లో ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ నిర్వహణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ వినియోగదారులకు జీఎస్టీ వల్ల తగ్గిన ధరల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, డిప్యూటి ఎంపీడీఓ మూర్తిబాబు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

పెనుగొండ: దేవీ నవరాత్రులు ముగియడంతో దొంగరావిపాలెం కొండాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మూలవిరాట్ కొండాలమ్మ కొలువై ఉన్న ఆలయం వద్ద ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల పిండి వంటలతో విందు భోజనాన్ని తలపించే విధంగా అన్న ప్రసాద వితరణ చేశారు. నాలుగు వేలకు పైగా భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

యలమంచిలి: రాష్ట్ర ఫ్యాప్టో ఇచ్చిన పిలుపుమేరకు పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాల బహిష్కరణపై వినతి పత్రాన్ని మండల విద్యాశాఖ అధికారులకు శుక్రవారం ఫ్యాప్టో నాయకులు అందజేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనపథకం కార్యక్రమాలు మాత్రమే ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుంటారని, మిగిలిన అన్ని బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు అధికారులకు తెలియజేశారు. విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగంలేని అన్ని యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు, అలాగే ఉపాధ్యాయులను నిర్బంధం చేస్తూ విద్యా శక్తి కార్యక్రమాన్ని ఒక ఫార్స్‌గా మార్చడంపై కూడా ఫ్యాప్టో అసంతృప్తిని వ్యక్తం చేస్తూ విద్యా శక్తి కార్యక్రమాన్ని కూడా బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి-1 అవిడి శ్రీవాణి, విద్యాశాఖ అధికారి-2 కేవీఆర్ కృష్ణంరాజులకు మండల ఫ్యాప్టో నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్ మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి పంతం రామమూర్తి నాయుడు కోశాధికారి వర్ధనపు సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు స్వీయ నిర్ణయాలు తీసుకోవాలి

పెనుగొండ: ప్రతి గర్భిణీ, బాలింత ఆరోగ్య సంరక్షణకు స్వీయ నిర్ణయం తీసుకునే సంకల్పంతో ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వాకా ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు రెండో త్రైమాసికంలో 4 నుంచి 6 నెలలు, మూడవ త్రైమాసికంలో 7 నుంచి 9 నెలలు కలిగిన వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కేబీ కేఎస్ రమేష్ రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి జె.సత్యనారాయణ, ఎస్.మీరమ్మ, పీహెచ్ఎన్ సీహెచ్ పద్మ, వై.వీరమ్మ పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సహాయం అందజేత

యలమంచిలి: బూరుగుపల్లి కొత్త కాలనీ చెందిన ముత్యాలపల్లి పెద్దిరాజు వృత్తి రీత్యా ఇస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతనికి రెండేళ్ల క్రితం పక్షవాతం రావడంతో కాలు, చేతులు పనిచేయడం లేదు. పెద్ద వయసు రావడంతో భార్య కూడా కష్టమైన పనులు చేయలేక ఇంటి దగ్గరే చిన్నపాటి పనులు చేస్తూ భర్తను పోషిస్తుంది. నెలకి రూ.2 వేలు మందులు, ఆసుపత్రికి ఖర్చవుతుందని ఏమైనా సహాయం చేయమని జై భీమ్ యువసేన ఫౌండేషన్ వారిని అడగడంతో ఒక ఐదు నెలల వరకు మందులు, హాస్పిటల్ నిమిత్తం జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం విరాళం రూ.11 వేలను మహిళా సభ్యుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జై భీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గెద్దం సునీల్ గవాస్కర్, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు రాయపూడి భవానీ, వల్లూరు కింబర్లీ పాల్గొన్నారు.

అగ్ని అస్త్రంతో పురుగుల నివారణ

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయ వరి సాగులో ఆకుముడత పురుగు, కాండం తొలిచే పురుగు, కాయ తొలిచే పురుగు, వేరు పురుగు నివారణకు అగ్ని అస్త్రం సమర్థంగా పని చేస్తుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి జి.జ్యోతి చెప్పారు. గుంపర్రు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు సమక్షంలో సామూహికంగా 50 లీటర్ల అగ్ని అస్త్రం తయారు చేశారు. దేశీ ఆవు మూత్రం 10-15 లీటర్లు, పచ్చి మిరప కాయలు పేస్ట్ ఒక కిలో, వెల్లులి పేస్ట్ అరకిలో, వేపాకు 5 కిలోలు, పొగాకు కాడలు కిలో తీసుకుని పాత్రలో వేసి మూడు పొంగులు వచ్చే వరకు మరగ పెట్టారు. తయారైన అగ్ని అస్త్రం 48 గంటలు తర్వాత పంటల పై వాడుకోవచ్చునని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ముత్యాలరావు, జడ్డు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.